

రంజాన్ వేళలు

ఇఫ్తార్ - బుధవారం
సాయంత్రం - 6.32

సహర్ - గురువారం
ఉదయం - 4.58


ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాల్లో అభ్యర్థుల విషయంలో ఇప్పటి వరకు అధికార పార్టీ మల్లగుల్లాలు పడుతోంది. ఇక్కడ బలమైన అభ్యర్థులను ఎవరిని బరిలో దింపాలా అన్న మీమాంసలో ఉంది. అయితే, చివరకు ఈ ఉత్కంఠ వీడినట్టే ఉంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి వచ్చిన చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డిని చేవెళ్ల నుంచి పోటీకి నిలపాలని, మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి సతీమణి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డిని రంగంలోకి దించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించినట్టు సమాచారం. వీరి అభ్యర్థిత్వాలను పార్టీ అధికారికంగా ప్రకటించనప్పటికీ పోటీలో వీరే ఉండవచ్చని చర్చ సాగుతోంది. ఈ రెండు స్థానాల విషయంలో పార్టీ అధిష్ఠానం చేసిన కసరత్తు కొలిక్కి వచ్చినట్టుగా ప్రచారం సాగుతోంది.

కొలిక్కి వచ్చిన పంచాయితీ!

- చేవెళ్ల అభ్యర్థిగా రంజిత్‌రెడ్డి
- మల్కాజిగిరి నుంచి సునీతారెడ్డి
- మహేందర్‌రెడ్డికి మంత్రి పదవి ఆఫర్!
- తొలి నుంచి కాంగ్రెస్ తప్పటడుగులు

చేవెళ్ల, మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థులు దాదాపు ఖరారు

తొలి నుంచి తప్పటడుగులు







(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

కాంగ్రెస్‌లో టికెట్ల పంచాయితీ దాదాపు కొలిక్కివచ్చింది. కొద్ది రోజులుగా చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ టికెట్ల విషయంలో పార్టీలో గందరగోళ పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. చేవెళ్ల సీటును సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డికి ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించింది. అలాగే ఈ టికెట్ ఆశించి భంగపడిన మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి సతీమణి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డికి మల్కాజిగిరి టికెట్ ఖరారు చేసినట్లు సమాచారం. మల్కాజిగిరి నుంచి పోటీకి సునీతారెడ్డి నిరాకరించడంతో కొద్ది రోజులుగా దీనిపై స్తబ్దత నెలకొంది. మహేందర్‌రెడ్డి కుటుంబసభ్యులతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడి వారిని బుజ్జగించడంతో వారు వెనక్కి తగ్గారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం జరిగే రాష్ట్ర క్యాబినెట్ విస్తరణలో మహేందర్‌రెడ్డికి అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. దీంతో మహేందర్‌రెడ్డి వెనక్కి తగ్గి సునీతారెడ్డిని మల్కాజిగిరి నుంచి బరిలో దింపేందుకు అంగీకరించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. వాస్తవానికి చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాల నుంచి పోటీ చేసేందుకు కొందరు పార్టీ సీనియర్లు ఆసక్తి చూపినప్పటికీ అకస్మాత్తుగా బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికి టికెట్లు ఇవ్వాలని పార్టీ నాయకత్వం నిర్ణయించింది. అయితే ఇలా ఎన్నికల తరువాత బీఆర్ఎస్‌లో చేరిన మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి సతీమణి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డికి మధ్య చేవెళ్ల టికెట్ విషయంలో రగడ మొదలైంది. నిజానికి చేవెళ్ల ఎంపీ టికెట్ ఇస్తామనే హామీతోనే మహేందర్ రెడ్డి కుటుంబం కాంగ్రెస్‌లో చేరింది. ఆమెను ప్రచారం కూడా చేసుకోవాలని సూచించడంతో ఆమె చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ప్రచారం మొదలు పెట్టారు. అనేక సభలు, సమావేశాలు నిర్వహించారు. అయితే అనూహ్యంగా బీఆర్ఎస్ ఎంపీ రంజిత్‌రెడ్డిని కూడా కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. దీంతో చేవెళ్ల టికెట్‌పై గందరగోళం మొదలైంది. సునీతారెడ్డిని మల్కాజిగిరి నుంచి పోటీ చేయాలని పార్టీ సూచించింది. దీంతో మహేందర్‌రెడ్డి కుటుంబీకులు షాక్ తిన్నారు. సునీతారెడ్డి తాను చేవెళ్ల నుంచే పోటీ చేస్తానని.. మల్కాజిగిరి వెళ్లేది లేదని స్పష్టం చేశారు. దీంతో మహేందర్‌రెడ్డి, ఆయన సతీమణి సునీతారెడ్డిలతో సీఎం మాట్లాడి వారిని బుజ్జగించారు. పార్లమెంట్ ఎన్నికల తరువాత మంత్రి పదవి ఇస్తామని మహేందర్‌రెడ్డికి ఆఫర్ ఇచ్చినట్లు తెలిసింది. దీంతో మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి పోటీకి వారు అంగీకరించారు. ఇదిలా ఉంటే త్వరలో బీఆర్ఎస్ నుంచి భారీగా చేరికలు ఉంటాయని చెబుతున్నారు. నగర శివార్లలోని బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, కీలక నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైనప్పటికీ అధికార కాంగ్రెస్ పార్టీలో మాత్రం కొంత గందరగోళ పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రధాన ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలు ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేయగా అధికార కాంగ్రెస్ మాత్రం ఇంకా అధికారికంగా అభ్యర్థులను నిర్ణయించలేదు. గతంలో బరిలో ఉంటారనుకున్న వారి స్థానంలో కొత్త పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి ఇన్‌చార్జ్‌గా ఉన్న చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో రోజుకో పరిణామం జరగడం విశేషం. అలాగే సీఎం రేవంత్ రెడ్డి నిన్నమొన్నటి వరకు ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి నియోజకవర్గంపై పార్టీకి స్పష్టత లేకపోవడం గమనార్హం. చేవెళ్ల నుంచి పోటీ చేసేందుకు మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆసక్తి కనపరిచారు. ఉమ్మడి జిల్లాలో పలుకుబడిన రాజకీయ నేతల్లో ఆయన ఒకరు. అలాగే ఆయనతో పాటు మరికొందరు సీనియర్లు కూడా చేవెళ్ల టికెట్ ఆశించారు. కానీ పార్టీ అధినాయకత్వం బయట నుంచి వలస వచ్చిన వారికే ప్రాధాన్యత ఇచ్చింది. వారికి టికెట్ విషయంలో కూడా అధికార పార్టీ గందరగోళంగానే వ్యవహరిస్తోంది. చేవెళ్ల నుంచి బరిలో దిగాలని భావించిన మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి సతీమణి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డికి పార్టీ నాయకత్వం చివరి క్షణంలో షాక్ ఇచ్చింది. ఆమె స్థానంలో సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి పేరు తెరపైకి తీసుకువచ్చింది. వీరికి టికెట్ ఇచ్చే విషయంలో కూడా చివరి వరకు గందరగోళమే నెలకొంది. రాష్ట్రంలో కీలకమైన చేవెళ్ల, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో పోటీ విషయంలో అధికార పార్టీ అనుసరిస్తున్న వైఖరి కాంగ్రెస్ నేతలతో పాటు సాధారణ కాంగ్రెస్ కార్యకర్తలకు అంతుపట్టడం లేదు. ఈ రెండు సీట్లపై కన్నేసిన బీజేపీ ఇప్పటికే ఇక్కడ బలమైన అభ్యర్థులను బరిలో దింపింది. వీరు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ఉమ్మడి జిల్లాలోని ఈ రెండు స్థానాల అభ్యర్థుల ఎంపిక విషయంలో సామాజిక సమతుల్యతను పాటించాయి. కానీ అధికార పార్టీ మాత్రం ఈ రెండు సీట్లు ఒకే సామాజిక వర్గానికి కేటాయించాలని నిర్ణయించింది. ఇదిలా ఉంటే చేరికల విషయంలో కూడా పార్టీ అధినాయకత్వం వ్యవహరిస్తున్న తీరుపై పార్టీ శ్రేణులు కూడా విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ఇటీవల బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్న సమయంలో ఉమ్మడి జిల్లాకు చెందిన పార్టీ కీలక నేతలు, ఎమ్మెల్యేలకు సరైన సమాచారం లేదని తెలుస్తోంది. ఉదాహరణకు చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరే సమయంలో పార్లమెంట్ పరిధిలోని ఒక్క కాంగ్రెస్ ఎమ్మెల్యే కానీ, జిల్లా పార్టీ అధ్యక్షుడు కానీ, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు కానీ లేకపోవడాన్ని పార్టీ సీనియర్లు తప్పుబడుతున్నారు. అలాగే నగర శివార్లలోని బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తిగా ఉన్నప్పటికీ ఇపుడేమీ తొందర లేదన్నట్లుగా నిన్నమొన్నటి వరకు కాంగ్రెస్ వ్యవహరిస్తూ వచ్చింది. అయితే ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో చేరికలపై స్పీడ్ పెంచింది. ఎన్నికల సమయంలో పార్టీ అధినాయకత్వం చేస్తున్న తప్పిదాలు ఫలితాలపై ప్రభావం చూపే అవకాశాలు కూడా లేకపోలేదు.

పరీక్షల్లో పొరపాట్లకు తావివ్వొద్దు

శామీర్‌పేట, మార్చి 19 : టెన్త్ పరీక్షల్లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా నిబంధనల మేరకు నిర్వహించాలని కలెక్టర్ గౌతమ్ అధికారులను, సూపరింటెండెంట్లను ఆదేశించారు. మంగళవారం శామీర్‌పేట మండలం అలియాబాద్‌లోని జడ్పీ పాఠశాలలో టెన్త్ పరీక్షల కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను, ఏర్పాట్లపై పరిశీలించారు. పరీక్ష పత్రాలు, ఆన్సర్ సీట్లను పోలీసు ఎస్కార్ట్‌తో రవాణా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 46,766మంది రెగ్యులర్ విద్యార్థులకు మంగళవారం 46,643 మంది పరీక్షకు హాజరైనట్టు అధికారులు తెలిపారు. కలెక్టర్ వెంట డీఈవో విజయలక్ష్మి, ఎంఈఓ వసంతకుమారి, ఎగ్జామ్ సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ ఉన్నారు.



అలియాబాద్‌లోని టెన్త్ పరీక్ష కేంద్రం నిబంధనలపై అధికారులకు సూచిస్తున్న కలెక్టర్ గౌతమ్

రెండో రోజు పరీక్ష ప్రశాంతం

వికారాబాద్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మంగళవారం జరిగిన పదో తరగతి ద్వితీయ భాష పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో 80 పరీక్ష కేంద్రాల్లో 13,419 మంది విద్యార్థులకు 13,361 మంది పరీక్ష రాశారు. రెగ్యులర్ విద్యార్థులు 13,401 మంది ఉండగా 13,342 మంది హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థుల హాజరు 99.6శాతం నమోదైంది.



వికారాబాద్‌లో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

రెండు రోజుల్లో పనులు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



వికారాబాద్, మార్చి 19 : ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచి 100 శాతం పనులు రెండు రోజుల్లో పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత శాఖల అధికారులతో ఆయన మాట్లాడారు. సీసీ రోడ్లు, లేబర్ మొబిలైజేషన్ పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. టెలీకాన్ఫరెన్స్‌లో డీఆర్డీవో శ్రీనివాసులు, డీపీవో సుధారాణి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



అటవీ క్షేత్రాల్లో అధికారుల తనిఖీ

తాండూరు రూరల్, మార్చి 19 : తాండూరు ప్రాంత అటవీ క్షేత్రాల్లో రెండేళ్లలో చేసిన పనులపై హైదరాబాద్ అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ రేంజ్ అధికారి చంద్రకాంత్‌రెడ్డి బృందం మంగళవారం తనిఖీలు నిర్వహించింది. అంతారం, జినుగుర్తి తదితర అటవీ క్షేత్రాల్లో జరిగిన పనులపై సమగ్ర వివరాలు సేకరించారు. అంతారం, గొట్లపల్లి, జినుగుర్తి అటవీక్షేత్రాల్లో 22 సాసర్‌పిట్లు, ప్లాంటేషన్‌ను ఏర్పాటుచేశారు. పనుల వివరాలను తాండూరు రేంజర్ శ్యాంసుందర్‌రావును అడిగి తెలుసుకున్నారు. నివేదికను రాష్ట్ర ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. వారివెంట విజిలెన్స్ బృందం, తాండూరు బీట్ ఆఫీసర్ మల్లయ్య ఉన్నారు.

ఏప్రిల్ 15 వరకు ఓటు నమోదుకు అవకాశం

- 'ఆంధ్రజ్యోతి'తో జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్



మేడ్చల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): "18ఏళ్లు నిండి, ఓటు హక్కు లేని వారు ఓటరుగా నమోదయ్యేందుకు ఏప్రిల్ 15 వరకు గడువు ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించేందుకు ఈ అవకాశాన్ని కల్పిస్తున్నారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని. పరిశీలించి అర్హులందరినీ అదనపు ఓటరు జాబితాల్లో చేర్పుతారు. 40శాతానికి పైబడి వైకల్యం ఉన్న వారు, 85ఏళ్లకు పైబడిన వారు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్నీ కల్పిస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ-1950 నంబరుతో పాటు సి-విజిల్ యాప్ అందుబాటులోకి తెచ్చాం." అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ పోట్రు వివరించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చేపడుతున్న చర్యలను ఆయన ఆంధ్రజ్యోతికి వివరించారు. కలెక్టర్ ఏమన్నారంటే...

ప్రస్తుతానికి ఆన్‌లైన్‌లోనే..

ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ. ఎన్నికల సందర్భాల్లో ప్రత్యేకంగా దరఖాస్తుల స్వీకరిస్తాం. అది ముగిశాక ఆన్‌లైన్‌లో అవకాశం ఉంటుంది. ఏ తేదీ వరకు లెక్కలోకి తీసుకోవాలన్న విషయంలో పరిమితులుంటాయి. అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియకు 10రోజుల ముందు వరకు వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకుంటాం. మల్కాజిగిరి లోక్‌సభ స్థానానికి ఏప్రిల్ 25న నామినేషన్ల దాఖలు ఆరంభమవుతుంది. అంటే ఏప్రిల్ 15 వరకు ఆన్‌లైన్‌లో ఓటరు నమోదు దరఖాస్తులను పరిశీలిస్తాం. మార్పులు చేర్పుల ఫారం-7, 8లను ఈ నెల 15వరకు వచ్చినవే పరిశీలిస్తాం. 40 శాతానికి మించి వైకల్యం ఉన్న వారికి ఇంటి వద్ద ఓటేసే అవకాశం ఇస్తాం. ఇంటివద్ద ఓటు వేసే వృద్ధుల వయసు ఈ సారి 85ఏళ్లకు పెంచారు. ఎన్నికల సిబ్బంది ఇళ్ల వద్దకు వచ్చి ఫారం 12-డి ఇస్తారు. వాటిని నింపి ఏప్రిల్ 22లోగా తిరిగి ఇవ్వాలి. ఎన్నికల విధుల్లో పాల్గొనే అత్యవసర విభాగాల్లో పనిచేసే ఉద్యోగుల మాదిరిగానే పాత్రికేయులకు కూడా ముందస్తుగా ఓటు హక్కు వినిగియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నాం.

అత్యవసరమైతే మినహాయింపు

ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో అభివృద్ధి పనులు చేపట్టే విషయంలో నిబంధనలు వర్తిస్తాయి. ఇప్పటికే ప్రారంభమైనవి మినహా కొత్తగా చేపట్టవద్దు. తాగునీటి పథకాలు పనిచేయక ప్రజలు ఇబ్బందులు పడితే.. ఎక్కడైనా విపత్తుతో ఇబ్బందులు తలెత్తితే అనుమతితో మరమ్మతులు చేయించొచ్చు.

ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్ 1950

ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేస్తాం. తనిఖీ బృందాలను నియమిస్తూ, చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నాం. పార్టీలు, నాయకులు నిబంధనలు ఉల్లంఘించినట్లు సమాచారముంటే 1950 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలి. మూడు షిఫ్టుల్లో 24గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారు. సి-విజిల్ యాప్‌తో ఆన్‌లైన్లోనూ ఫిర్యాదు చేయొచ్చు. స్మార్ట్‌ఫోన్‌తో ఉల్లంఘనల చిత్రాలు తీసి పోస్టు చేయొచ్చు. అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగించిన పోలింగ్ కేంద్రాలనే లోక్‌సభ ఎన్నికల్లోనూ వినియోగిస్తాం. ఆయా కేంద్రాల్లో ఏర్పాట్లు చూసి పోలింగ్ నాటికి సిద్ధం చేస్తాం. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలో 3,200 పోలింగ్ కేంద్రాలున్నాయి.

మరింత అభివృద్ధి చేసేందుకే పార్టీ మారాను

అధిష్ఠానం ఆశీస్సులతో చేవెళ్ల నుంచి పోటీ చేస్తా : ఎంపీ రంజిత్‌రెడ్డి



మాట్లాడుతున్న చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి

పరిగి, మార్చి 19 : చేవెళ్ల నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకే తాను పార్టీ మారానని, కాంగ్రెస్ అధిష్ఠానం ఆశీస్సులతో చేవెళ్ల లోక్‌సభ స్థానం నుంచి మరోసారి పోటీచేస్తానని చేవెళ్ల ఎంపీ జి.రంజిత్‌రెడ్డి అన్నారు. పరిగిలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డిలు చొరవ తీసుకుని చేవెళ్ల పార్లమెంట్ స్థానాన్ని జిల్లాగా చేస్తే రాష్ట్రంలోనే ధనిక జిల్లాగా అవతరిస్తుందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చేవెళ్ల లోక్‌సభ స్థానాన్ని జిల్లా చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఒప్పుకున్నారన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఉమ్మడి జిల్లాను అధోగతిపాలు చేసిందన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, ఆనందం పాల్గొన్నారు.

పరిగిని కమ్మేస్తున్న కాలుష్యం!

వాయి కాలుష్యంతో వందల ఎకరాల్లో పంట నష్టం

- విష వాయువులతో దీర్ఘకాలిక రుగ్మతల బారిన జనం
- ప్రజారోగ్యం, పంటల గురించి పట్టించుకోని అధికారులు
- పరిశ్రమలను తరలించాలని స్థానికుల డిమాండ్



పరిశ్రమలు వెదజల్లుతున్న కాలుష్యం

పరిగి, మార్చి 19 : పచ్చని పంటలు, పంట భూములు కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయి. నిబంధనలను ఉల్లంఘించి పరిశ్రమలు పొగ, కాలుష్యాన్ని ఎగచిమ్ముతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పరిశ్రలకు చుట్టూ నాలుగైదు కిలోమీటర్ల దూరం వరకు పంట పొలాలు పొగచూరుతున్నాయి. పరిగి-రాఘవాపూర్‌ల మధ్య 40 ఎకరాల్లో ఓ స్టీల్ పరిశ్రమను స్థాపించారు. ఈ పరిశ్రమను కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారు. పరిశ్రమ నుంచి దట్టమైన పొగ, కాలుష్య కారక వాయువులు వెలువడుతున్నాయి. పొగ గొట్టాల నుంచి భారీగా మంటలు, పొగలు వస్తుండ డంతో పరిసర ప్రాంతాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో కాలుష్యాన్ని తగ్గించే ఆస్కారమున్నా అది ఖర్చుతో కూడుకున్న పని అని యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. పొగ, ఇతర కలుషిత వాయివులు, వ్యర్థాలను బయటకు వదుల్తున్నారు. ఫ్యాక్టరీతో చేకూరుతున్న నష్టంతో వందల ఎకరాల్లో పంటలు దెబ్బతింటున్నాయి. పంటలు పాడవడంతో పాటు పరిగి, రాఘవాపూర్, మల్కాపూర్, లక్ష్మీదేవిపల్లి, నారాయణపూర్ గ్రామాల్లో కాలుష్య వాయువులు వ్యాపిస్తున్నాయి. రాత్రి 8 నుంచి ఉదయం 8గంటల వరకు 12గంటల పాటు కాలుష్యాన్ని బయటకు వదుల్తున్నారు.

పొగతో పరిగి పట్టణానికి ముప్పే!

ఈ కంపెనీ వెదజల్లుతున్న పొగ, కాలుష్యంతో పంటలకే కాకుండా మనుషులకూ తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. కాలుష్య వ్యాయువులతో జనం వివిధ రోగాల బారినపడుతున్నారు. జనం కొత్తకొత్త రుగ్మతలకు గురవుతున్నారు. పరిగి పట్టణమంతా దట్టంగా పొగ నిండుతోంది. ఇళ్ల వద్ద బట్టలు ఆరేస్తే పొగతో నల్లగా మారుతున్నాయి. పరిగి పరిధి తిరుమల రెసిడెన్సీ కాలనీ, భవానీనగర్, మైత్రి కాలనీ, శ్రీనివాస హిల్స్, సిద్ధాంతి కాలనీలు పొగతో నిండుతున్నాయి. ఈ కాలుష్యంపై ఇటీవల లక్ష్మీదేవిపల్లికి చెందిన వ్యక్తి లోకాయుక్తలోనూ ఫిర్యాదు చేశాడు. కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. గతంలోనూ కాలనీ వాసులు మునిసిపల్ కమిషనర్, తహసీల్దార్లకు ఫిర్యాదు చేశారు. కాలుష్యాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలని రైతులు ఫ్యాక్టరీ మేనేజ్‌మెంట్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదు. రాజకీయ అండదండలతోనే ప్రజల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పొలాల్లో పొగ కమ్ముకొని పంటలు పండడం లేదని కొందరు సాగునే మానేశారు!



పొగ ప్రభావంతో ఎండిన మొక్కల

విష వాయువులతో పలు రకాల రుగ్మతలు



కలుషిత వాయువును పీలిస్తే పలు రకాల రోగాలు వస్తాయి. ముఖ్యంగా విష వాయువులతో శ్వాసకోశ సంబంధ వ్యాధులొచ్చే ఆస్కారం ఉంది. కాలుష్య వాయువు పీల్చితే కణాల వల్ల క్యాన్సర్ వచ్చే ముప్పు కూడా ఉంది. దీర్ఘకాలంగా కలుషిత గాలి పీల్చితే మనుషులు అనేక రకాల రుగ్మతలకు గురవుతారు.

- డాక్టర్ ఎస్.ప్రవీణ్, పరిగి

ఇళ్లలో కలుషిత వాయువులు వ్యాపిస్తున్నాయి



స్టీల్ పరిశ్రమ కాలుష్యం పరిగిలోని తిరుమల రెసిడెన్సీ వరకు వ్యాపించింది. రాత్రి నుంచి ఉదయం వరకు కాలుష్య వాయువు, పొగ వస్తున్నది. బట్టలు బయట ఆరేయలేకపోతున్నాం. ఫ్యాక్టరీల అధికారులు కాలుష్యాన్ని నియంత్రించాలి.

- అరుణ, రెసిడెన్సీ, పరిగి

వాకింగ్ చేయలేకపోతున్నాం



ఉదయం వాకింగ్ చేసేందుకు బయటకు వెళ్లలేకపోతున్నాం. సమస్యపై ఇటీవల మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కలుషిత గాలితో శ్వాస పీల్చడంలో ఇబ్బందులు పడుతున్నాం. ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా శ్వాసకోశ ఇబ్బందులతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు.

- రఘు, టీచర్, మైత్రీకాలనీ

పరిశ్రమను ఇక్కడి నుంచి తొలగించాలి



ఇక్కడ ఫ్యాక్టరీ పెట్టడాన్ని మేం మొదట్లోనే వ్యతిరేకించాం. కాలుష్యం రాదని చెప్పారు. ఇప్పుడు దట్టమైన పొగమంటలు, విషవాయులు బయటకొస్తున్నాయి. పంటలు మాడుతున్నాయి. నాలుగైదువందల ఎకరాల్లో పం టనష్టం జరుగుతోంది. అధికారులకు దృష్టికి తీసుకెళ్లి నా పట్టించుకోవడం లేదు. ఫ్యాక్టరీని తీసేయాలి.

- లింగం, రైతు, పరిగి



తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో తనిఖీ

వికారాబాద్, మార్చి 19: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో వసు చంద్ర మంగళవారం వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌తో మాట్లాడారు. అనంతరం పదో తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. అక్కడ జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచుతున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి ఉన్నారు.


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఆర్డీవో వసు చంద్ర

ఏప్రిల్ 2 నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కొడంగల్, మార్చి 19: పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఏప్రిల్ 2వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ ధర్మకర్తలు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఏటా బ్రహ్మోత్సవాలను తిరుపతి మాదిరిగానే అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, తితిదే తరఫున శేష వస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఏప్రిల్ 2న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 3న సేనాధిపతి ఉత్సవం, అంకురార్పన, 4న ధ్వజారోహణం, తిరుచ్చి ఉత్సవం, పెద్దశేష వాహనం, 5న చిన్న శేష వాహనం, హంస వాహనం, 6న సింహ వాహనం నిర్వహించనున్నారు. వ్యాళి వాహనం, 7న కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, 8న మోహిని అవతార ఉత్సవం, అమావాస్య పూలంగిసేవ, గరుడోత్సవం, లంకా దహనం, తిరుమల తిరుపతి నుంచి శేష వస్త్రాల సమర్పణ చేయనున్నారు. అదేవిధంగా 9న హనుమంత వాహనం, వసంతోత్సవం, ఉగాది ఆస్థానం, గజ వాహనం, 10న సూర్య ప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం, 11న రథోత్సవం, అశ్వ వాహనం నిర్వహించనున్నారు. 12న పల్లకీ సేవ, చక్రస్నానం, ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ప్రతీ రోజు మధ్యాహ్నం 3 గంటలకు స్వామివారికి అభిషేకం, సాయంత్రం 7గంటలకు ఊంజల్ సేవ, శ్రీ బాలాజీ పాడుతా తీయగా కార్యక్రమం, రాత్రి 9 గంటల నుంచి 11గంటల వరకు భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



కొడంగల్ వేంకటేశ్వరస్వామి ఆలయం

కాంగ్రెస్‌లో చేరిక

బొంరాస్‌పేట్, మార్చి 19: మండలంలోని తుంకిమెట్ల గ్రామానికి చెందిన ఎస్సీ సెల్ మండల మాజీ అధ్యక్షుడు తోలు వెంకటయ్య కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చంద్రప్రకాశ్ ఆధ్వర్యంలో తోలు వెంకటయ్యతో పాటు మాజీ సర్పంచ్ ఉప సర్పంచ్ వెంకటయ్య తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మండల, నియోజకవర్గంలోని ఎస్సీ కుటుంబాలకు సేవలందిస్తానని తెలిపారు.


కాంగ్రెస్‌లో చేరుతున్న ఎస్సీ సెల్ మండల మాజీ అధ్యక్షుడు తోలు వెంకటయ్య
















ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఈద్గా కమిటీ

రంజాన్ పండుగ ఏర్పాట్ల పరిశీలన

తాండూరు: మార్చి 19: తాండూరు మున్సిపల్ పరిధిలోని చెంగేష్‌పూర్ రోడ్డులో గల ఈద్గాను మంగళవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్థానిక ముస్లింలతో కలిసి పరిశీలించారు. సమస్యలపై ఈద్గా కమిటీ అందజేసిన వినతిపత్రాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.


విచారణ జరుపుతున్న డీఎల్‌పీవో సంధ్యారాణి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చీలాపూర్‌లో డీఎల్‌పీవో విచారణ

పూడూరు, మార్చి 19: చీలాపూర్ పంచాయతీ కార్యదర్శి ఇళ్ల నిర్మాణ అనుమతులకు మామూళ్లు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై ఈనెల 3వ తేదీన 'ఇళ్ల అనుమతులకు మామూళ్ల వసూలు' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. డీఎల్‌పీవో సంధ్యారాణి మంగళవారం చీలాపూర్‌లో పంచాయతీ కార్యదర్శిపై విచారణ జరిపారు. ఇట్టి విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సుందర్, ప్రత్యేకాధికారి తులసిరామ్, చీలాపూర్ ఇన్‌చార్జి మాణిక్యం పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

పరిగి, మార్చి 19: పరిగి పట్టణంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం గణపతిపూజ, విశ్వక్సేనపూజ, పుణ్యావచనం, స్వామి వారికి అభిషేకం, ధ్వజారోహణం, పంచగ్యపాశణ, గోవుపూజ, మృత్యుగ్రహణం, అంకురార్పణం, దీక్షాధారణం, రుత్సాంగవణం, సాయంత్రం తులసి అర్చన, కుంకుమ అర్చన, సాయంత్రం ఎదురుకోళ్ళ కార్యక్రమాలు నిర్వహించారు. 54 యజ్ఞగుండంలతో సుదర్శన యాగంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన దంపతులు కూర్చున్నారు. ఈఉత్సవాల్లో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి దంపతులు కూర్చొని ప్రత్యేకపూజలు చేశారు. పండితులు వారికి స్వాగతం పలికారు. స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ ఉత్సవాల్లో మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్ కృష్ణ, కె.కృష్ణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, ఆయా పార్టీల నాయకులు కె.రఘుమోహన్‌రెడ్డి, ఎస్సీ బాబయ్య, కె.హన్మంత్‌ముదిరాజ్, బి.ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఉత్సవాల పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు

కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష

- మహేశ్వరంలో బీఆర్‌ఎస్‌కు భారీ గండి
- రోజురోజుకూ పెరుగుతున్న ముఖ్యనేతల రాజీనామాలు
- కాంగ్రెస్ బలోపేతానికి వరుస సమావేశాలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు తీగల, కేఎల్లార్, జడ్పీచైర్ పర్సన్ అనితాహరినాథ్‌రెడ్డి

మహేశ్వరం, మార్చి 19 : మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్‌లో చీలికలు, అధికార కాంగ్రెస్‌లో చేరికలు ఊపందుకున్నాయి. మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి ఆయన కోడలు మహేశ్వరం జడ్పీటీసీగా ఉన్న రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డిలు ఇప్పటికే అధికార కాంగ్రెస్‌లో చేరి వారి అనుచరులను పార్టీలో చేర్చుకోవడంలో బిజీబిజీగా గడుపుతున్నారు. తాజాగా చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి కూడా చేరడంతో నియోజకవర్గంలోని మరికొంతమంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమౌతున్నారు. మండల ఇన్‌చార్జి ఎంపీపీ ఆర్. సునిత అంద్యానాయక్ దంపతులు, తుమ్మలూరు మాజీ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు వి.యాదగిరిలు అనుచరులతో రెండు రోజుల్లో కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే మహేశ్వరం మాజీ సర్పంచ్ కూన యాదయ్య, మన్‌సాన్‌పల్లి ఎల్లమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ మర్యాద మురళీధర్‌రెడ్డితో పాటు మాజీ సర్పంచ్‌లు, ఉపసర్పంచులు, బీఆర్ఎస్ మండల స్థాయి నాయకులు, తుక్కుగూడ మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు పద్మలతో పాటు నియోజకవర్గంలోని తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీలు, మీర్‌పేట, బడంగ్‌పేట కార్పొరేషన్లకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరారు. మహేశ్వరం, కందుకూరు మండలాలకు చెందిన కొందరు మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఉపసర్పంచులతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ కార్యకర్తలు కూడా కాంగ్రెస్‌లో చేరబోతున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. కేఎల్లార్ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు బీఆర్ఎస్‌ను నియోజకవర్గంలో కనుమరుగు చేయాలనే ఉద్ధేశంతోనే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు చాపకింద నీరులా పావులు కదుపుతున్నారు. ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మాత్రం ఇదంతా జరుగుతున్నా మౌనంగా ఉండడంతో నియోజకవర్గం బీఆర్ఎస్ వర్గాల్లో తీవ్ర దుమారాన్నే లేపుతోంది.


మాట్లాడుతున్న తీగల కృష్ణారెడ్డి, అనితాహరినాథ్‌రెడ్డి

మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను ఖాళీ చేయాలి

మాజీ ఎమ్మెల్యే తీగల, జడ్పీ చైర్‌పర్సన్ అనిత

మహేశ్వరం, మార్చి 19 : మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు బీఆర్ఎస్‌ను ఖాళీ చేయడమే లక్ష్యంగా పనిచేసి లోక్‌సభ ఎన్నికల్లో విజయఢంకా మోగించాలని మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ అనితాహరినాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గం పరిధిలోని మీర్‌పేటలో గల తీగల క్యాంపు కార్యాలయంలో మహేశ్వరం, కందుకూరు మండలాల ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కష్టపడే కార్యకర్తలను కాంగ్రెస్ కంటికి రెప్పలా కాపాడుకుంటుందన్నారు. త్వరలో అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు వేసి ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి చేరవేయడంలో ముందుండేలా చర్యలు తీసుకుందామన్నారు. ఎం.కరుణాకర్‌రెడ్డి, యాదగిరి, జైపాల్‌రెడ్డి, జగన్, మర్యాద రాఘవేందర్‌రెడ్డి, సదానంద్‌గౌడ్, పాండు, హన్మంత్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కారు దిగి కాంగ్రెస్‌లోకి కౌన్సిలర్లు

- అదే బాటలో ఎంపీపీ.. చర్చలు పూర్తి!

షాద్‌నగర్ అర్బన్, మార్చి 19: షాద్‌నగర్ మున్సిపాలిటీలోని కౌన్సిలర్లు కొందరు కారు దిగి కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిలు చర్చలు జరుతున్నారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జీవన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిల గెలుపే లక్ష్యంగా కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ ముఖ్యనాయకులు కాంగ్రెస్‌లో చేరడానికి ప్రోత్సహిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే ఇద్దరు జడ్పీటీసీలు, ఒక ఎంపీపీ, పలువురు సర్పంచ్‌లను చేర్చుకున్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేస్తున్నారు. కొందరు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, తాజా మాజీ సర్పంచ్‌లు సైతం అధికార పార్టీలో చేరడానికి ఉత్సాహం చూపుతున్నారు. ఎమ్మెల్యే పిలిచినప్పుడే కాంగ్రెస్‌లోకి వెళ్లితే ప్రాధాన్యత ఉంటుందని భావిస్తూ, పార్టీలో చేరడానికి ఆసక్తిని చూపుతున్నారు. ఇటీవలనే షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొందరు ఎంపీటీసీలు కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా ఫరూఖ్‌నగర్ ఎంపీపీ ఖాజా ఇద్రీష్ అహ్మద్, షాద్‌నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్ అగ్గనూరి విశ్వం, కౌన్సిలర్లు విశాల, లతశ్రీలతో పాటు మరికొందరు కౌన్సిలర్లలో చర్చలు జరిపినట్లు సమాచారం. వారు బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరబోతున్నారని సమాచారం. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని 28 మంది కౌన్సిలర్లలో ఇద్దరు మాత్రమే కాంగ్రెస్‌లో ఉన్నారు. మరో ఇద్దరు చేరబోతున్నారు. మరి కొంతమందిని చేర్చుకోవడానికి చర్చలు జరుగుతున్నట్లు సమాచారం.




అట్టహాసంగా బండలాగుడు పోటీలు

కేశంపేట, మార్చి 19: మండల పరిధిలోని బైర్కాన్‌పల్లిలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. పోటీలను కేశంపేట జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి ప్రారంభించారు. నాగర్‌కర్నూల్, గద్వాల జోగులాంబ, వనపర్తి జిల్లాకు చెందిన ఎడ్ల జతలతో పోటీదారులు పాల్గొన్నాయి. ప్రథమ బహుమతి నాగర్‌కర్నూల్ జిల్లా జోజిరెడ్డి ఎద్దుల జత పొందింది. ప్రథమ బహుమతిని దాత కొట్టం శశివర్ధన్‌రెడ్డి రూ.60వేలు నగదు అందించారు. రెండో బహుమతి గద్వాల బోగులాంబ జిల్లా హరి ఎద్దుల జత గెలుచుకుంది. బహుమతిని దాత మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వై.యాదయ్య యాదవ్ రూ.50వేలు, మూడో బహుమతి వనపర్తి జిల్లా, పెద్దదగడకు చెందిన గోపాలకృష్ణ ఎద్దుల జత గెలుచుకుంది. జడ్పీటీసీ రూ.30వేలు అందించారు. గద్వాల జోగులాంబ జిల్లా అయిజకు చెందిన భాస్కర్ గౌడ్ ఎద్దుల జత నాలుగో బహుమతి పొందింది. రూ. 20వేలు యెన్నం గోపాల్ రెడ్డి అందించారు. పోటీలను తిలకించడానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. మాజీ సర్పంచ్‌లు రూప్లానాయక్, కృష్ణయ్య, రాఘవేందర్‌రావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.









ఎమ్మెల్సీ ఎన్నికలకు క్యాంపు రాజకీయాలు

- సౌత్‌ఇండియా టూర్‌కు వెళ్లనున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు!
- సీఎం సొంత జిల్లాలో కాంగ్రెస్ గెలుపు కోసం నాయకుల పట్టు
- తమదే గెలుపంటున్న బీఆర్ఎస్ నాయకులు



పెద్దఎల్కిచర్ల ఎంపీటీసీ మంగమ్మకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్/కొత్తూర్, మార్చి 19 : మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ సత్తా చాటాలనుకున్న కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులకు గాలం వేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ వ్యూహాన్ని దెబ్బతీయాలనే ఉద్దేశ్యంతో బీఆర్ఎస్ అధిష్ఠానం సూచన మేరకు స్థానిక నాయకులు.. ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులను, వారి కుటుంసభ్యులతో కలిపి క్యాంపులకు తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఓటర్లను సౌత్‌ఇండియా టూర్‌కు తరలించేందుకు బీఆర్ఎస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. ప్రధాన దేవాలయాలతో పాటు, ఊటీ, కొడయ్‌కెనాల్, గోవా ప్రాంతాలకు విహారయాత్రకు తరలివెళుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ పరిధిలోకి రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని 6మండలాలు, 2మున్సిపాలిటీలు, కల్వకుర్తి నియోజకవర్గంలోని 4మండలాలు, ఒక మున్సిపాలిటీ వస్తుంది. ఇందులో మొత్తం 171మంది ఓటర్లు ఉన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మరి కొంతమంది బీఆర్ఎస్ ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్‌నగర్ కావడంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలుపును సవాలుగా తీసుకుని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు గాలం వేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ఆ పార్టీ ముఖ్యనేతలు బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీటీసీలు, కౌన్సిలర్లను తమ పార్టీలో కలుపుకునేందుకు సులవుగా ముందుకు సాగుతుండగా, మరోవైపు బీఆర్ఎస్ నాయకులు మాత్రం తమ ప్రజాప్రతినిధులు కాపాడుకునేందుకు క్యాంపులకు తరలించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. క్యాంపులకు తరలిస్తే ప్రజాప్రతినిధులు చేజారి పోకుండా ఉంటారనే ఉద్దేశ్యంతో తరలిస్తున్నట్లు తెలుస్తోంది. వారం రోజులపాటు క్యాంపులకు వెళ్లి ఈనెల 28న జరిగే ఎమ్మెల్సీ ఎన్నిక రోజు తిరిగి వస్తారని విశ్వసనీయ సమాచారం. కొందరు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు క్యాంపులకు వెళ్లేందుకు విముఖత చూపుతున్నా.. మరి కొందరు ప్రజాప్రతినిధులు క్యాంపులకు వెళ్లేందుకు సిద్ధమైనట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ పరిధిలో 1,439 మంది ఓటర్లు ఉండగా, 9 వందలకు పైగా బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన ఓటర్లు ఉన్నారు. ఎమ్మెల్సీ చేజారి పోకుండా బీఆర్ఎస్ నాయకులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. క్యాంపులకు తరలిస్తే తమదే విజయమని ఆ పార్టీ నాయకులు ధీమాగా ఉండగా, కాంగ్రెస్ నాయకులు మాత్రం తాము ఖచ్చితంగా విజయం సాధిస్తామని బాహాటంగానే చెప్పుకుంటున్నారు. ఏది ఏమైనప్పటికీ ఎన్నికల్లో ఎవరి వ్యూహం ఫలిస్తుందో వేచి చూడాల్సిందే.

పోలీస్ లాంఛనాలతో ఏఆర్ కానిస్టేబుల్‌కు తుది వీడ్కోలు

బషీరాబాద్, మార్చి 19: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఏఆర్ కాని స్టేబుల్ అంత్యక్రియలు సోమవారం రాత్రి పోలీస్ లాంఛనాలతో నిర్వహించారు. బషీరాబాద్ మండలం అల్లాపూర్ గ్రామానికి చెందిన కృష్ణకుమార్ (ఏఆర్ కానిస్టేబుల్)ఈ నెల 18న ఓ శుభకార్యానికి వెళ్లి వస్తూ వికారాబాద్ మండలం పులుసుమామిడి గేట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు పోలీస్ లాంఛనాలతో గార్డ్‌ఆఫ్ హానర్‌తో తుది వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో తాండూర్ రూరల్ సీఐ అశోక్, ఆర్ఐ డేవిడ్ విజయ్, ఎస్ఐలు రమేష్, పోలీసు సిబ్బంది పలు వురు పాల్గొన్నారు.


అల్లాపూర్‌లో పోలీస్ లాంఛనాలతో ఏఆర్ కానిస్టేబుల్ అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం


ఎర్త్ సెంటర్‌ను పరిశీలిస్తున్న సినీ నటుడు సుమన్

పర్యావరణ పరిరక్షణ.. సామాజిక బాధ్యత

కడ్తాల్, మార్చి 19: పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతగా గుర్తించాలని ప్రముఖ సినీనటుడు సుమన్ అన్నారు. మండలంలోని అన్మాస్‌పల్లి సమీపంలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ది ఎర్త్ సెంటర్‌ను మంగళవారం సుమన్ సందర్శించారు. సంస్థ చైర్మన్ లీలా లక్ష్మారెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం వారు ది ఎర్త్ సెంటర్‌ను పరిశీలించి.. పర్యావరణ పరిరక్షణకు చేపడుతున్న కార్యక్రమాలపై ఆనందం వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ శంకర్, సంస్థ నిర్వాహకులు లక్ష్మారెడ్డి, రజనీకాంత్, కోటేశ్, వెంకటేశ్, ఉమామహేశ్వర్‌రెడ్డి, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

బొంరాస్‌పేట, మార్చి 19: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డికి ప్రభుత్వం రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంతో మంగళవారం కొడంగల్‌లో ఆయనను కాంగ్రెస్ నాయకులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్, నర్సిములు నాయుడు, ఉమాపతి, వీరేశం, మల్లికార్జున్, దేశ్యానాయక్, మల్లేశ్, రవినాయక్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గో ప్రదక్షిణ ద్వారానే జ్ఞానం

● బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు



ప్రవచనాలు చెబుతున్న చాగంటి కోటేశ్వరరావు

తాండూరు: మార్చి 19: గో ప్రదక్షిణ ద్వారానే జ్ఞానం పెరుగుతుందని ప్రవచనకర్త బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. తాండూరు పట్టణంలో మంగళవారం నిర్వహించిన గోశాల దశాబ్ది ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గోవు ఉన్నచోటనే పవిత్రత ఉంటుందన్నారు. గోశాలలు పరమశివుడి రూపమేనన్నారు. గోవులు మలమూత్ర, విసర్జన ద్వారా పరమ పవిత్రత లభిస్తుందని తెలిపారు. గోవులో ఉన్న ప్రతీ అవయవం పవిత్రమైనదన్నారు. ఆవులకు పూజలు చేస్తే 33వేలకోట్ల దేవతలకు పూజించినట్లేనని వ్యాఖ్యానించారు. కాలం, అందం క్షీణించిపోతుందని, సేవలు నిలిచిపోతాయని హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్, గోశాల సేవా సమితి అధ్యక్షుడు బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు అపూర్వ స్పందన


విద్యార్థులను ఇంటర్వ్యూ చేస్తున్న పరిశ్రమల నిర్వాహకులు

ఘట్‌కేసర్, మార్చి 19: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధి లోని కొండాపూర్‌లో గల సంస్కృతి పాలిటెక్నిక్ కళాశా లలో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు అపూర్వ స్పందన లభించింది. రిలయన్స్ జియో ఇన్ఫోకామ్, షిండ్లర్ ఇండియా, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీ, ప్రీమియర్ ఎనర్జీలు, తోషిబాట్రాన్స్‌పార్మర్స్, వాసవీ వీల్స్, వరుణ్ మోటార్స్, పీపాల్ ట్రీ వెంచర్, టీమ్‌లేస్, సీగర్ వంటి సంస్థలు వేర్వేరుగా నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 185మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నీలం సింగ్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శివకేశవరెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.ఉదయ్‌కిరణ్‌లు మాట్లాడుతూ.. విద్యార్థులు పరిశ్రమలకు అవసరమైన పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. విద్యార్థులకు నిత్యం అందించిన శిక్షణతో మంచిఫలితాలు సాధించినట్లు తెలిపారు. ఇందులో విద్యార్థుల కృషి ఎంతో ఉందని గుర్తు చేశారు. ఇలాంటి ఎంపికలు తోటివిద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చింతచెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి


నారాయణ మృతదేహం

పూడూరు, మార్చి 19: చింతచెట్టుపై నుంచి పడి ఓవ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పూడూరు మండలం పెద్దఉమ్మెంతల్ గ్రామంలో చోటుచేసుకుంది. చెన్‌గోముల్ ఎస్‌ఐ మధుసూదనరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సిరిగాయపల్లి గ్రామానికి చెందిన అంబటి నారాయణ(45) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పెద్దఉమ్మెంతల్ గ్రామానికి వెళ్లి మంగళవారం చింతచెట్టు ఎక్కి చింతకాయలు రాలుస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చింత కొమ్మ విరిగి నారాయణ కిందపడ్డాడు. దీంతో కాలు విరిగి, తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన గ్రామస్థులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య అంబటి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుసూదనరెడ్డి తెలిపారు.

తాండూరులో యువకుడి మృతదేహం లభ్యం

తాండూరు: మార్చి 19: తాండూరు పట్టణం డీసీఎంఎస్ కాంపౌండ్ ఆవరణలో సుమారు 35 సంవత్సరాల వయస్సు కలిగిన యువకుడి మృతదేహం కుళ్లిపోయిన దశలో లభ్యమైంది. ఆ యువకుడు వారం రోజుల కిందట మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని పరిశీలించి మృతుడు నాగరాజుగౌడ్‌గా గుర్తించారు. సంగారెడ్డి జిల్లా కోల్లాపూర్ గ్రామానికి చెందిన నాగరాజుగౌడ్ తాండూరు పట్టణం ఇంద్రానగర్ ప్రాంతానికి చెందిన బంధువుల ఇంటికి శివరాత్రి పండుగకు వచ్చాడని, అతడి మానసిక స్థితి బాగాలేదని చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వీధి కుక్కల దాడిలో 15 గొర్రెలు మృత్యువాత


వీధికుక్కల దాడి మృత్యువాతపడిన గొర్రెపిల్ల

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 19: మండలంలోని కొర్రెములకు చెందిన మెట్టురమేష్, మొగుళ్ళ అయిలయ్య గొర్రెల మందలపై వీధికుక్కలు మంగళవారం ఉదయం దాడిచేసి 15గొర్రెలను చంపేశాయి. వీధికుక్కలు గొర్రెలతో పాటు వాటి పిల్లలపై దాడిచేసి చంపేశాయి. దీంతో దాదాపు రూ.లక్షన్నర నష్టం వాటిల్లిందని గొర్రె కాపారులు మెట్టు రమేష్, మొగుళయ్యలు ఆరోపించారు. ఎంతో కష్టపడి పెంచుకుంటున్న గొర్రెలు కుక్కలదాడిలో మృతి చెందడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు. వీధికుక్కలను పంచాయతీ వారు జీహెచ్ఎంసీ అధికారులకు పట్టించాలని కోరారు. పరిహారం అందేలా అధికారులు చొరవచూపాలని కోరారు.

వాహనాల తనిఖీలో రూ.3లక్షలు పట్టివేత


వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ సైదులు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 19: ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధి లోని ఘట్‌కేసర్, అవుషాపూర్‌లో సీఐ ఎస్.సైదులు మంగళవారం ఉదయం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని రూ.3లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆ నగదును జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా గ్రివీయేన్స్ కమిటీకి అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సార్వత్రికల ఎన్నికల నియామళిని ఉల్లంగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలకోడ్ ఉన్నందున ఎక్కువ మొత్తంలో నగదు తీసుకెళ్లాలంటే సరైనా అధారాలు చూపించాలన్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో క్రైం సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు అశోక్, రామునాయక్, శేఖర్, శ్రీకాంత్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భర్తపై భార్య, బావమరిది దాడి.. కేసు నమోదు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 19: తన కొడుకును చూడటానికి వచ్చిన భర్తపై భార్య, బావమరిది దాడికి దిగారు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మౌలాలీ, ఎస్‌పీ నగర్‌లో నివాసముంటున్న భుక్యా పవన్‌తో ఘట్‌కేసర్‌కు చెందిన ఇస్లావత్ కవితతో 2018లో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య విభేదాలు రావడంతో ఇద్దరూ వేర్వేరుగా ఉంటూ 12 జూన్ 2023లో విడాకుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. భర్త పవన్ అప్పుడప్పుడు కవిత ఇంటికి వెళ్లి కుమారుడిని చూసుకుని వచ్చేవాడు. కాగా ఈనెల 17వ తేదీన రాత్రి 10.30గంటలకు పవన్ ఘట్‌కేసర్ మున్సిపల్, కొండాపూర్‌లో ఉంటున్న భార్య కవిత ఇంటికి కుమారుడిని చూడటానికి వెళ్లాడు. దీంతో భార్య కవిత, బావమరిది రామ్మూర్తిలు కలిసి పవన్‌ను అసభ్యకరంగా దూషిస్తూ కర్రతో దాడికి దిగారు. పవన్ అతడి స్నేహితుడి సాయంతో అక్కడినుంచి తప్పించుకుని పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కవిత, ఆమె తమ్ముడు రామ్మూర్తిపై విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైక్ దొంగ అరెస్ట్


పోలీసుల అదుపులో యాదయ్య, దొంగిలించిన బైక్

కీసర రూరల్, మార్చి 19: జల్సాలకు అలవాటుపడి బైక్‌లను చోరీ చేస్తున్న దొంగను మంగళవారం కీసర పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కీసర సీఐ వెంకటయ్య వివరాల ప్రకారం.. ఏర్పుల సాయి సాగర్ అనే యువకుడు తన కుటుంబ సభ్యులతో కలిసి నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలోని ఆర్ఎల్‌నగర్‌లో నివాసముంటూ స్విగ్గీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. కీసర పోలీసులు నాగారం మున్సిపల్ పరిధి మారుతి గార్డెన్ వద్ద తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన సాయిసాగర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అతన్ని విచారించగా తన నేర వివరాలను వెల్లడించాడు. ప్రైవేట్ ఉద్యోగంలో వస్తున్న సంపాదన సరిపోకపోవటంతో దొంగతనాల బాట పట్టాడు. ఈ క్రమంలో ఉప్పల్, భువనగిరి, కీసర, తదితర పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇప్పటికే పలు బైక్ చోరీ కేసులు నమోదయ్యాయి. జైలు శిక్షనూ అనుభవించాడు. ఈ మధ్యనే బెయిల్‌పై విడుదలయ్యాడు. అతడి వద్ద నుంచి వివిధ కంపెనీలకు చెందిన ఏడు బైక్‌లతో పాటు ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

కులకచర్లలో దొంగ రిమాండ్

కులకచర్ల: కులకచర్ల గ్రామానికి చెందిన గుండుమల్ల చంద్రశేఖర్ ఈనెల 6న తన బైక్‌ను పార్కింగ్ చేసి తిరిగి వచ్చి చూసే సరికి బైక్ కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీసీకెమెరాలు పరిశీలించి ఆ వ్యక్తి చౌడాపూర్ మండలం వీరాపూర్ యాదయ్యగా గుర్తించి అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. బైక్‌ను తానే దొంగిలించినట్లు అంగీకరించడంతో మంగళవారం బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యం


నాగలక్ష్మి

పరిగి,మార్చి 19: ఓ యువతి అదృశ్యమైంది. పరిగి మండలం కాళ్యాపూర్ గ్రామానికి చెందిన కె.సత్తయ్య కూతురు కె.నాగలక్ష్మి(19), పరిగిలోని ఓ కళాశాలలో డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతుంది. ఈ నెల 18న సోమవారం కళాశాల వెళతానని ఇంటి నుంచి బయలుదేరింది. కళాశాలకు వెళ్ళకుండా ఏటుపోయిందో తెలియదు. స్నేహితులు, బంధువుల దగ్గర వెతికిన ఆచూకీ లభించలేదు. యువతి తల్లి ఇంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

పరిశ్రమలకు అవసరమయ్యే పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న యుబీ దేశాయ్, నీలిమా

ఘట్ కే సర్ రూరల్, మార్చి 19: విద్యార్థులు పరిశ్రమలకు అవసరమయ్యే పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అనురాగ్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ యు.బీ దేశాయ్ తెలిపారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో మంగళవారం ఎంబీఏ బిజినెస్ అనలిటిక్స్ ఇండస్ట్రీ అనుసంధానం చేసే ఇమ్మర్శివ్ కార్యక్రమాన్ని ఆయన సీఈవో నీలిమాతో కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ బాలాజీ ఉట్ల, ప్రొఫెసర్లు సయ్యద్ మన్సూర్, వేణుగోపాల్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు


తాండూరులోని పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

తాండూరురూరల్, మార్చి 19 : తాండూరు మండల పరిధిలోని 14 పరీక్షా కేంద్రాల్లో రెండో రోజు సెకెండ్ లాంగ్వేజ్ హిందీ పరీక్ష ప్రశాంతంగా కొనసాగినట్లు మండల విద్యాధికారి వెంకటయ్య తెలిపారు. మొత్తం 2,273 మంది విద్యార్థులకు గాను, 2,264 మంది పరీక్షలు రాయగా, 9 మంది గైర్హాజరయ్యారు. మండల పరిధిలోని పరీక్షా కేంద్రాలను కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి పర్యవేక్షించారు.

బొంరాస్‌పేట్: పదో తరగతి వార్షిక పరీక్షలు బొంరాస్‌పేట్ మండలంలో ప్రశాంతంగా కొనసా గుతున్నాయి. రెండో రోజు మంగళవారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని పరీక్షా కేంద్రాల్లో మొత్తం 517 మంది పరీక్ష రాయాల్సి ఉండగా ఒకరు గైర్హాజరైనట్లు ఎంఈవో రాంరెడ్డి తెలిపారు.

మేడ్చల్ మున్సిపాలిటీలో వార్షిక ఆడిట్

మేడ్చల్ టౌన్, మార్చి 19: మున్సిపల్ కార్యాలయంలో అధికారులు వార్షిక ఆడిట్ నిర్వహిస్తున్నారు. ప్రతీ సంవత్సరం మున్సిపల్ లావాదేవీలు, జమఖర్చులపై నిర్వహించే ఆడిట్ గత కొద్ది రోజులుగా కొనసాగుతోంది. జిల్లా ఆడిట్ అధికారి వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో అధికారుల బృందం ఆడిట్ నిర్వహిస్తున్నారు. ఈ ఆడిట్ ఇంకా రెండు మూడు రోజుల పాటు కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టం

మర్పల్లి, మార్చి 19: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని మర్పల్లి అంగన్‌వాడీ టీచర్ మొగులమ్మ అన్నారు. మర్పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లి పాలపట్ల గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన గంట లోపు తల్లి ముర్రుపాలు తాగించడం ఎంతో మంచిదన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టుల తనిఖీ


సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్

బషీరాబాద్, మార్చి 19: సరిహద్దు ప్రాంతంలోని మైల్వార్, నవాంద్గీ గ్రామాల వద్ద చెక్ పోస్టులను బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడా విధుల్లో ఉన్న పోలీసులకు లోక్‌సభ ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ తదితర అంశాలపై వివరిస్తూ పలు సూచనలు చేశారు. చెక్‌పోస్టుల్లో వాహనాల రాకపోకలపై పక్కగా నిఘా పెట్టాలన్నారు. చెక్‌పోస్టుల్లో తనిఖీ చేసిన ప్రతి వెహికిల్ నెంబర్‌ను రికార్డుల్లో నోట్ చెసుకోవాలని పోలీసులకు సూచించారు. ఆయన వెంట ఆర్ఐ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లు స్వరాజ్యం వర్ధంతి


మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

పరిగి, మార్చి 19: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోదురాలు కామ్రేడ్ మల్లు స్వరాజ్యం రెండవ వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.వెంకటయ్య, బస్సు చంద్రయ్యలు మాట్లాడుతూ భూమికోసం, భుక్తికోసం మల్లు స్వరాజ్యం పోరాటం చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సతీష్, అక్బర్, హబీబ్, సత్తయ్య, రఘురామ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రుక్మిణీ పాండురంగ స్వామి కల్యాణం

కులకచర్ల, మార్చి 19: మండలంలోని బండవెల్కిచర్ల గ్రామంలో రుక్మిణి పాండురంగ స్వామి 21వ వార్షిక మహోత్సవంలో భాగంగా మంగళవారం కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేద బ్రహ్మణులు కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం రుక్మిణి పాండురంగస్వామి రథోత్సవం నిర్వహించారు. రథాన్ని గ్రామంలోని వీధుల మీదుగా ఊరేగించారు. నిర్వాహకులు నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వాలి

దోమ, మార్చి 19: కష్టపడి పని చేసే కార్యకర్తలకు తగిన గుర్తింపును ఇవ్వాలని బీజేపీ సీనియర్ నాయకుడు ఘనపూర్ వెంకటయ్యగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు కేశవులు అన్నారు. దోమ, కులకచర్ల మండలాలకు చెందిన బీజేపీ కార్యకర్తల సమావేశాన్ని దోమ మండలంలోని మైలారం గ్రామంలో మంగళవారం నిర్వహించారు. బీజేపీ జెండా మోసిన ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామని తెలిపారు. ఈ సమావేశంలో టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యులు హరిక్రిష్ణ, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి పాల్గొన్నారు.

సాగు విధానంలో మెలకువలు పాటించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మూడుచింతలపల్లి, మార్చి 19 : రైతులు సాగు విధానంలో అధికారుల సలహాలు, సూచనలతో పాటు మెలకువలు పాటించాలని రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి మాధవిలత అన్నారు. మంగళవారం మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో వరిలో యాజమాన్య పద్ధతుల పై రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మట్టి పరీక్షల లాభాలు, ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకం, వర్మి కాంపోస్ట్ లాభాలను వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వెంకటరాంరెడ్డి, ఏఈవోలు కృష్ణవేణి, సుధీర్‌కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యాలాల: పత్తి సాగులో రైతులు మెలికలు పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చునని తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుధారాణి అన్నారు. యాలాల మండల కేంద్రంలో గల రైతు వేదికలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విద్యాలయం ఆధ్వర్యంలో అధిక సాంద్రత పత్తి సాగు యజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సుధారాణి మాట్లాడుతూ పత్తిసాగులో మెలికలు పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త సుధాకర్, వ్యవసాయ డాక్టర్లు యమున, లక్ష్మణ్, రాజశేఖర్ రెడ్డి, వ్యవసాయాధికారులు యాదగిరి, నజీరుద్దీన్, రజిత, సూర్య ప్రకాష్‌రైతులు తదితరులు పాల్గోన్నారు.

తహసీల్దార్, రైతు మధ్య వాగ్వాదం


రైతును బయటకు పంపిస్తున్న రెవెన్యూ సిబ్బంది

బషీరాబాద్, మార్చి 19: కోర్టు ఆర్డర్ కాపీని అందజేసి ఎదుట కూర్చీలో కూర్చున్నందుకు తహసీల్దార్ ఇష్టానుసారంగా తిట్టాడని బషీరాబాద్ మండలం భోజ్యానాయకర్‌తండా రైతు మాణ్యానాయక్ మంగళవారం ఆరోపించారు. తన వ్యవసాయ పొలానికి సంబంధించి సర్వే కోసం కోర్టు ఆర్డర్‌తో వచ్చి తహసీల్దార్‌కు అందజేశానన్నారు. ఎదుట కూర్చీలో కూర్చుంటే తహసీల్దార్ నీవు ఎవరంటూ ప్రశ్నిస్తూ కోపంతో నోటికొచ్చినట్లు తిట్టాడని ఆందోళన వ్యక్తం చేశాడు. తహసీల్దార్, రైతు మధ్య గొడవ తారాస్థాయి చేరడంతో అక్కడే కార్యాలయంలో ఉన్న అధికార సిబ్బంది వచ్చి రైతును బయటకు పంపించారు. తహసీల్దార్‌పై ఉన్నతాధికారులకు కలిసి ఫిర్యాదు చేస్తానని రైతు పేర్కొన్నారు. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా తాను తిట్టలేదని, అమర్యాదగా ప్రవర్తిస్తూ కూర్చీలో కూర్చుంటే నీవు ఎవరంటూ ప్రశ్నించడంతో వాగ్వాదానికి దిగాడని ఆయన వెల్లడించారు.

సంక్షిప్తంగా..

● **తాండూరు:** హైదరాబాద్ రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో మంగళవారం గర్భిణులకు అంగన్ వాడీ టీచర్లకు గార్డెన్ ఎన్‌కోబా గార్డెన్‌లో డిజిటల్ మాధ్యం ద్వారా అవగాహన కల్పించారు. రామకృష్ణ మఠం చెందిన ఆర్యజనని ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంగన్ వాడీ టీచర్లకు న్యూట్రిషన్ కిట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మి, బాలకృష్ణ పాల్గొన్నారు.

● **ఘట్‌కేసర్:** మున్సిపాలిటీలోని 13వ వార్డులో రూ.9లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులను ఘట్‌కేసర్ మున్సిపలల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జహంగీర్, రవీందర్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రాకేష్ పాల్గొన్నారు.

● **శామీర్‌పేట:** తూంకుంట మున్సిపల్ పరిధిలోని పోతాయిపల్లిలో గల 15 వ వార్డులో మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, వార్డు కౌన్సిలర్ హరిబాబు గౌడ్, డీఈ మంగళవారం పరిశీలించారు.

● **మేడ్చల్ టౌన్:** మధ్యప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జి మురళీధర్ రావును మేడ్చల్ జిల్లా బీజేపీ నాయకులు మంగళవారం మర్యాదపూరకంగా కలిశారు. జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు గౌరారం జగన్ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నాయకులు మురలశీధర్ రావు నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఎంల్లంపేట గ్రామ శివలింగం చిత్ర పటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో మహేష్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

● **నవాబుపేట:** మండలంలోని మైతాబ్‌ఖాన్ గూడ గ్రామంలోని 402, 403 సర్వే నెంబర్‌లో 200 ఎకరాల ప్రభుత్వ భూమిని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కబ్జా చేసి పూడ్చివేయించాడని గ్రామస్థులు ఆరోపించారు. మంగళవారం వికారాబాద్ జిల్లా ఆర్డీవో, నీటి పారుదల శాఖ అధికారికి వారు ఫిర్యాదు చేశారు.

● **బొంరాస్‌పేట్:** పోలెపల్లి ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి దర్శనం కోసం భక్తులు భారీగా తరలి వచ్చారు. మంగళవారం అమ్మవారి దర్శనం కోసం భక్తులు క్యూలో వేచి ఉన్నారు. భక్తులు బోనాలతో అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

● **శామీర్‌పేట్:** శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం ఘనంగా అన్నదానం జరిగింది. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓడి బియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు.

● **కొడంగల్:** మండలంలోని ఖాజఅహ్మద్‌పల్లి గ్రామానికి చెందిన కుర్వ నాగప్ప ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెం శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ వారు మంగళవారం బాధిత కుటుంబానికి రూ.11లక్షల 92వేల 500 బీమా చెక్కును నామిని కుర్వ మల్లమ్మకు అందజేశారు.

జాతీయస్థాయి టెక్‌ఫెస్ట్

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 19: కాచవానిసింగారంలోని నల్లమల్లారెడ్డి ఇంజనీరింగు కళాశాలలో రెండు రోజుల పాటు జాతీయస్థాయి టెక్నికల్ ఫెస్ట్ నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ నల్ల దివ్యా మంగళవారం తెలిపారు. ఈ 20, 21 రెండు రోజుల పాటు సాగే టెక్నికల్ ఫెస్ట్‌లో దేశవ్యాప్తంగా ఐదువేల మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఇంజనీరింగ్ విద్యాబోధనలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టెవిధంగా ఈ ఫెస్ట్ కొనసాగుతుందని తెలిపారు. ఇలాంటి టెక్నికల్ ఫెస్ట్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెడతాం

మేడ్చల్ టౌన్, మార్చి 19: మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహ్మారెడ్డిపై అవిశ్వాసం పెడుతామని మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ చాపరాజు అన్నారు. అవిశ్వాసం నోటీసు త్వరలో జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నామని తెలిపారు. అవిశ్వాసానికి సరిపడా మెజారిటీ ప్రస్తుతం తమ వద్ద ఉందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావటంతో అవిశ్వాసం వాయిదా పడుతున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని చాపరాజు ఖండించారు. అవిశ్వాసానికి కావాల్సిన ఏర్పాట్లు తమ పార్టీ పెద్దలు చేస్తున్నారని తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మర్పల్లి, మార్చి 19: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు.మండలానికి చెందిన బీఎస్పీ వికారాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి రాజు తన అనుచరులతో కలిసి మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని భావించి కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పరిగి, మార్చి 19: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం పరిగి మండలం సుల్తాన్‌పూర్ స్టేజి సమీపంలో చోటుచేసుకుంది. కర్ణాటకలోని యాద్గీర్ తాలుకా బాల్‌సేడి గ్రామానికి చెందిన శాబప్ప(35), పరిగి నుంచి కొడంగల్ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో పరిగి మండలం సుల్తాన్‌పూర్ స్టేజి దగ్గర బస్సును క్రాస్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న డీసీఎం బలంగా ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరిగి ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

2.5కిలోల గంజాయి పట్టివేత

● ఇద్దరి అరెస్ట్


గంజాయితో పట్టుబడ్డ నిందితులు

మేడ్చల్ టౌన్, మార్చి 19: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధి రాజ బొల్లారం గ్రామానికి చెందిన నీలేష్(28), కుమార్‌ప్రసాద్(21)లు తమ ఇంట్లో గంజాయి విక్రయాలకు పాల్పడుతుండగా ఎస్‌వోటీ పోలీసులు సోమవారం రాత్రి ఇంటిపై దాడులు నిర్వహించి 2.5కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఒరిస్సా నుంచి గంజాయి తీసుకొచ్చి స్థానికంగా ఉన్న బిహార్, ఒరిస్సా లేబర్లకు విక్రయిస్తున్నారని పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఫంక్షన్‌హాల్‌లో రిసెప్షన్.. ఇంట్లో చోరీ


దొంగలు ధ్వంసం చేసిన బీరువా

మేడ్చల్ టౌన్, మార్చి 19: శుభకార్యం జరుగుతున్న ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మేడ్చల్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ పట్టణం కిష్టాపూర్ నివాసి రమేష్ కూతురు పెళ్లి రిసెప్షన్ ఉండటంతో ఇంటికి తాళం వేసి కేఎల్ఆర్ వెంచన్ ఫంక్షన్ హాల్‌కు వెళ్లారు. ఫంక్షన్ ముగించుకుని ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం విరిగి ద్వారాలు చెరిచి ఉన్నాయి. అనంతరం ఇట్లో ప్రవేశించి చూడగా బీరువాలో దాచిన నాలుగు తులాల బంగారం, 60తులాల వెండితో పాటు నగదు చోరీ అయింది. దీంతో బాధితుడు రమేష్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి తీవ్రగాయాలు

కొడంగల్ రూరల్, మార్చి 19: బైక్ అదుపు తప్పి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కొడంగల్ మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన రవిగౌడ్, అశోక్ మంగళవారం సాయంత్రం కొడంగల్‌కు పని నిమిత్తం వచ్చి తిరుగు ప్రయాణంలో సొంత గ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో అన్నారం గ్రామ శివారులో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న బండరాళ్లను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న రవిగౌడ్, అశోక్‌లకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన వాహనదారులు వారిని ఆటోలో కొడంగల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.